క్లుప్తంగా

9 మంది వలంటీర్ల రాజీనామా


రాజీనామా పత్రాలతో వలంటీర్లు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పుట్లగట్లగూడెంలో 9 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు శుక్రవారం రాజీనామా చేశారు. ముందుగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బడే సత్యనారాయణలను కలిసి తమ ఆవేదనను తెలుపుకున్నారు. అనంతరం సచివాలయం సెక్రటరీకి వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రభుత్వ సేవలను పేదలకు చేరవేస్తున్న తమపై ప్రతిపక్షాలు కక్ష కట్టి చేస్తున్న తప్పుడు ఆరోపణలతో మనస్తాపం చెంది వలంటీర్ విధులకు రాజీనామా చేసినట్లు చెప్పారు.

నూకాలమ్మకు విశేష పూజలు


నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో కొలువైన నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాలు, పుణ్య నదీజలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. మూల విరాట్‌కు ఏకాదశ హారతి పూజలు, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, నీరాజన మహామంత్ర పుష్పం, సాయం సంధ్యా హారతి ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్‌లో వేంచేసియున్న శ్రీ సీతారామ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

జగన్ పాలనలోనే పేదలకు మేలు


నాయకులగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనతోనే పేదలకు మేలు చేకూరుతుందని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలో పాతకొండగూడెం, నాయకులగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలన్న, ప్రజలకు ఇంకా మేలు జరగాలన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరలా అధికారంలో తీసుకురావాలని ఆమె గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.జ్యోతిబాస్ తెలిపారు. వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బాలిక స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం నుంచి బాలిక కనిపించకపోవడంతో బాలిక తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలిక అదృశ్యంపై గురుధపక్షి నగర్‌కు చెందిన సాయి సుధీర్‌పై అనుమానం ఉన్నట్లు బాలిక తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడని, ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ.1,00,001 విరాళంగా అందజేశారు. భీమవరానికి చెందిన డి.నాగప్రసాద్ రాజు, సునీత దంపతులు కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ గిరిజారాణి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఉచిత వైద్యశిబిరం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని సుశీల హాస్పిటల్‌లో శుక్రవారం గ్యాస్ట్రో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కిమ్స్ హాస్పిటల్ గచ్చిబౌలికి చెందిన ప్రముఖ వైద్యులు, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ఉన్నమట్ల రాజేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. సమస్యలు ఉన్న రోగులకు సూచనలు చేసి మందులు అందజేశారు. సుశీల హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కేఆర్ రామచంద్రబాబు, కిమ్స్ హాస్పిటల్ ఈవెంట్ ఆర్గనైజర్ సి.మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా వనితకు బ్రహ్మరథం

- వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత నామినేషన్
- ఇసుకేస్తే రాలనంతగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, మహిళలు


ప్రజలకు అభివాదం చేస్తున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత


యర్నగూడెం నుంచి ర్యాలీగా వెళుతున్న పార్టీ శ్రేణులతో నిండిన జాతీయ రహదారి

ద్వారకాతిరుమల: ఇసుక వేస్తే రాలనంత జనం.. ఎటు చూసినా వైఎస్సార్ సీపీ జెండాలే.. ఏ నోట విన్నా జై జగన్.. జై వనితమ్మ నినాదాలే. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెట్టించేలా కార్లు, బైక్, ఆటోల భారీ ర్యాలీ. ఇవన్నీ రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత నామినేషన్ సందర్భంగా కనిపించాయి. మంత్రి వనిత గోపాలపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్‌ను దాఖలు చేశారు. ముందుగా ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా ఉదయాన్నే యర్నగూడెంలోని పార్టీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి డీజే, కేరళా డప్పు వాయిద్యాలు, డీజే సందళ్లు, పార్టీ శ్రేణులు, అభిమానులు, అశేష జనసందోహం నడుమ బైక్‌లు, కార్లు, ఆటోలతో భారీ ర్యాలీగా బయల్దేరి కృష్ణంపాలెం, రామన్నపాలెం, ధుమంతునిగూడెం మీదుగా దేవరపల్లి బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ పెద్ద ఎత్తున మహిళలు మంత్రి వనితకు గుమ్మడి కాయలతో దిష్టితీసి హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఆమె అదే గ్రామంలో కొలువైన ఆంజనేయస్వామి వారికి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. అనంతరం తిరిగి దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్దకు చేరుకున్న మంత్రి వనిత ఉదయం 10.45 గంటలకు అక్కడే నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. తిరిగి ప్రారంభమైన ర్యాలీ గొల్లగూడెం మీదుగా గోపాలపురానికి చేరుకుంది. అడుగడుగునా ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. ఇదిలా ఉంటే గోపాలపురంలో పార్టీ శ్రేణులు క్రేన్ సహాయంతో వనితకు భారీ గజమాలలను వేశారు. ఆ తరువాత తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఆమె తన భర్త తానేటి శ్రీనివాస్, సోదరుడు జొన్నకూటి విజయ్ మోహన్ కుమార్, గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ), రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, రాష్ట్ర అతిరాసా కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావులతో కలసి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె.లక్ష్మీ శివజ్యోతికి అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, చెలికాని సంజయ్, పోల్కంపల్లి అనీల్, బొందాడ వెంకన్నబాబు, ఘంటా శ్రీను, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పానమాల ఉమామహేశ్వరరావు, అచ్యుత ఏసుబాబు, కుంటం స్వర్ణలత, దూలపల్లి ప్రసాద్, చిలుకూరి చంద్రం, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివ, పెద్ద పానకాలు, కంచుం అంజిబాబు, దాకారపు అగ్గియ్య, బోడపాటి చంద్రం, పసుపులేటి ఏసుబాబ తదితరులున్నారు.


మంత్రి వనితకు గుమ్మడి కాయలతో దిష్టి తీస్తున్న మహిళలు


పార్టీ శ్రేణులతో గోపాలపురంలో కిక్కిరిసిన రహదారి


ర్యాలీలో మేము సైతం అంటూ.. బుల్లెట్లపై యువతులు

ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయండి


మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పార్టీ నేతల ప్రచారం

జంగారెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి కోరారు. పట్టణంలోని 19వ వార్డులో శుక్రవారం గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెట్టి గురునాధరావు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, చిటికెల అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకే మున్నూరుకాపుల మద్దతు

కుక్కునూరు: మున్నూరు కాపుల మద్దతు వైఎస్సార్ సీపీకే అని ఆ సంఘ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం మున్నూరుకాపుల ఆత్మీయ సంఘ సమావేశంలో ఆ సంఘ నాయకులు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీ డీ లుగా రిజర్వేషన్లు పొందిన మున్నూరు కాపులు రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో విలీనం తరువాత ఓసీలుగా మారారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆన్‌లైన్‌లో మున్నూరుకాపు కులం లేదన్న కారణంతో రెవెన్యూ అధికారులు కులధ్రువీకరణ పత్రాల జారీ నిలిపివేశారన్నారు. దీంతో మున్నూరుకాపులు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్‌లు లేక, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక ఎంతో నష్టపోయారన్నారు. దీనిపై అప్పటి టీడీపీ ప్రభుత్వం తమకు న్యాయం చేయలేకపోయిందన్నారు. 2019 ఎన్నికల అనంతరం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మున్నూరు కాపుల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారని, ఆయన వెంటనే స్పందించి జీఓను విడుదల చేసి తమకు కులధ్రువీకరణ పత్రాలు అందించి రిజర్వేషన్ అందేలా చేశారని సంతోషం వ్యక్తం చేశారు. ఇంతలా మున్నూరుకాపులకు న్యాయం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు మన్యం సత్యనారాయణ, మాదిరాజు వెంకన్నబాబు, ఉట్కూరి రాజారావు, మల్లేల చంటినాయుడు, మాదిరాజు ఖాదర్‌బాబు, యర్రంశెట్టి మల్లయ్య, మన్యం కోటేశ్వరరావు, వనమా వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న మున్నూరుకాపు కులస్తులు

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు




సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పార్టీ నేతలు సీహెచ్ జ్ఞానారెడ్డి, బీవీఎస్ రెడ్డి, సొంగా సందీప్

లింగపాలెం: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా గోదావరి జిల్లాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి), ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీకోసం కష్టపడి పనిచేసి చింతలపూడి ఎమ్మెల్యేగా కంభం విజయరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఎం సూచించినట్లు బీవీఎస్ రెడ్డి తెలిపారు.

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి తెలిపారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌ను జ్ఞానారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో పరిస్థితులపై వైఎస్ జగన్ ఆరా తీసినట్లు చెప్పారు.

నామినేషన్‌కు స్వచ్ఛందంగా తరలిరండి


సమావేశంలో మాట్లాడుతున్న కంభం విజయరాజు, పార్టీ నేతలు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను చింతలపూడిలో శనివారం ఉదయం 10.53 గంటలకు నామినేషన్ వేస్తున్నానని, ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కంభం విజయరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం లింగపాలెంలో పార్టీ నేత బీవీఎస్ రెడ్డి గెస్ట్‌హౌస్ నందు నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలపూడి నుంచి పార్టీ శ్రేణులతో కలసి భారీ ర్యాలీగా పాదయాత్రగా నామినేషన్ కార్యక్రమానికి వెళ్లనున్నట్లు విజయరాజు తెలిపారు. తొలుత ధర్మాజీగూడెం నుంచి ఉదయం 8 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తల బైక్ ర్యాలీగా లింగపాలెం నుంచి వెలగలపల్లి మీదుగా చింతలపూడి వెళ్లడం జరుగుతుందన్నారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. నామినేషన్ కార్యక్రమం అనంతరం చింతలపూడి నుంచి ర్యాలీగా లింగపాలెం మండలం రంగాపురంలో శ్రీసత్యన్నారాయణస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, సర్పంచ్‌లు తాడేపల్లి శాంతరావు, కె రమేష్, డి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియకు తరలిరండి

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు శనివారం నామినేషన్ దాఖలు చేయనున్నారని, ఈ కార్యక్రమానికి భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ నేత, పోలవరం నియోజవకర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం పట్టణ, మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు భారీగా తరలిరావాలని కోరారు.

మరోసారి జగన్ సీఎం అయితేనే పేదలకు న్యాయం


టి.నరసాపురం మండలం కె.జగ్గవరంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న తెల్లం రాజ్యలక్ష్మి

టి.నరసాపురం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడం ద్వారానే పేదలకు న్యాయం జరుగుతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పోలవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని బందంచర్ల, కె.జగ్గవరం, అల్లంచర్ల రాజుపాలెం, కొత్తగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనురాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, వంటిపల్లి వెంకటేశ్వరరావు, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, టి.కిషోర్, సర్పంచ్‌లు తడికలపూడి శివమాధవి కిషోర్, జల్లా మూర్తి, ఎంపీటీసీ రాంబాబు, తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, ఆచంట నాగమణి, బోట్ల విశ్వనాధం, ఆచంట కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.

మద్ది అంజన్న సన్నిధిలో...


మద్ది క్షేత్రంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

జంగారెడ్డిగూడెం రూరల్: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని శుక్రవారం దర్శించారు. నామినేషన్ పత్రాలను స్వామివారి పాదాల వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం నామినేషన్ వేసేందుకు బయలుదేరి వెళ్లారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, కొయ్య లీలాధరరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: రాజుపోతేపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఈఈ పి.రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'సాక్షి' స్పెల్ బీ, మ్యాథ్ బీ ఫైనల్స్‌లో 'ప్రతిభ'

జంగారెడ్డిగూడెం: 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించే 'స్పెల్ బీ', 'మ్యాథ్ బీ' ఫైనల్స్ పోటీలకు జంగారెడ్డిగూడెం ప్రతిభ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విజేతలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం తమ పాఠశాల విద్యార్థి ఫైనల్స్‌లో ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను తలదన్ని చాంపియన్‌గా నిలిచారన్నారు. ఈ విద్యాసంవత్సరంలో కూడా ఇంటర్నేషనల్ స్పెల్ బీలో, అలాగే స్పెల్ వెల్‌లో చాంపియన్స్ గా నిలిచి ట్రోఫీలు, నగదు బహుమతులు గెలుచుకున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ సరోజారెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం స్పెల్ బీ ఫైనల్స్‌కి ఎంపికైన ప్రతిభా సరోజారెడ్డి 2019, 2020 సంవత్సరాల్లో 'రిడిల్ బీ' ఫైనల్స్‌కు సెలెక్ట్ అయినట్లు తెలిపారు. ఈ విద్యార్థిని స్పెల్ వెల్‌లో కూడా చాంపియన్ గా నిలిచినట్లు వివరించారు. కాగా సాక్షి మ్యాథ్-బీలో 2వ తరగతి విద్యార్థిని పి.గ్రీష్మ, 4వ తరగతి విద్యార్థి బి.హేమచంద్ర ఫైనల్స్‌కు చేరుకున్నారని సరోజారెడ్డి తెలిపారు. మ్యాథ్-బీ ఫైనల్స్ ఈ నెల 22న, స్పెల్-బీ ఫైనల్స్ ఈ నెల 24న హైదరాబాద్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సాక్షి స్పెల్‌బీ - మ్యాథ్ బీ ఫైనల్స్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రతిభ పాఠశాల యాజమాన్యం

ధాన్యం కొనుగోలు ప్రారంభం


పుట్లగట్లగూడెంలో ధాన్యం రాశులను పరిశీలించిన వ్యవసాయాధికారి పోశారావు

జంగారెడ్డిగూడెం రూరల్: సొసైటీలు, డీసీఎంఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ పోశారావు తెలిపారు. మండలంలోని రైతుల కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. 60 వేల గోనెసంచులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కోతలు పూర్తయిన రైతులు వెంటనే రైతు భరోసా కేంద్రం సిబ్బందికి తెలియజేయాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో కోతలు కోసిన తర్వాత ధాన్యాన్ని ఎక్కువ రోజులు ఆరబెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో పోశారావు అన్నారు. ఎక్కువ రోజులు ధాన్యాన్ని ఆరబెడితే ముక్క శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. రబీ సీజన్‌లో 5,334 ఎకరాల్లో రైతులు సాగు చేసినట్లు తెలిపారు. 5 వేల ఎకరాల్లో ఎంటియూ 1121, 434 ఎకరాల్లో పీఆర్ 126 సాగు చేశారన్నారు. ఇప్పటివరకు 300 ఎకరాల్లో పీఆర్ 126, 400 ఎకరాల్లో ఎంటీయు 1121 రకం కోతలు పూర్తయినట్లు ఏవో తెలిపారు.

24న నామినేషన్‌కు తరలిరండి

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 24వ తేదీ ఉదయం 8.30కు దుద్దుకూరులోని తన నివాసం నుంచి ర్యాలీగా నామినేషన్ వేసేందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఉదయం 10.39 గంటలకు ఐటీడీఏ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

రెండో రోజు నామినేషన్లు నిల్

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండో రోజు శుక్రవారం నామినేషన్లు దాఖలు కాలేదు. గురువారం రెండు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. ఇదిలా ఉండగా రిటర్నింగ్ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పలు గ్రామాల్లో ఎస్ఈబీ దాడులు

చింతలపూడి: చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ఎస్ఈబీ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ గణపతి బాబు ఆధ్వర్యంలో శుక్రవారం పలు గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ డీఎస్‌వీవీ ప్రసాద్ తెలిపారు. దాడుల్లో 2,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 40 లీటర్ల నాటుసారాని, 14 డీపీఎల్ బీర్ బాటిల్స్‌ను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు పి.లక్ష్మణరావు, ఆర్.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎన్నికల వ్యయంపై నిఘా

చింతలపూడి: అభ్యర్థుల ఎన్నికల వ్యయంపై పటిష్టమైన నిఘా పెట్టినట్లు నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎస్‌ఏ రామన్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల వ్యయాన్ని నమోదు చేసి వీడియోలు తీయాలన్నారు. ప్రతి రోజు అభ్యర్థుల వ్యయానికి సంబంధించిన నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి కె అద్దయ్య, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

కామవరపుకోట: ప్రతి ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తడికలపూడి ఎస్సై జయబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐఎస్‌ఎఫ్ జవాన్లతో కలిసి కామవరపుకోట, తాడిచర్ల గ్రామాల్లో కవాతు నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ కె.రమేష్, కె.రామకృష్ణ, సుధీర్, జి.సూర్యారావు, షాజహాన్, వీఆర్‌వో కె.బాబురావు పాల్గొన్నారు.